ఈనాడు
హైదరాబాద్

శుక్రవారం 15 ఫిబ్రవరి 2008 ★ 20 పేజీలు

# తెలివుంటే తేడా తెలుసుకో!

## ప్రేమ, స్నేహం తేడాలపై పద్మినీరంగరాజన్ తోలుబొమ్మలాట..



తోలుబొమ్మలాట ప్రదర్శిస్తున్న పద్మినీరంగరాజన్

న్యూస్‌టుడే, నారాయణగూడ

కాలేజీలో చదువుతున్న ఓ కుర్రాడికి.. ఓ అమ్మాయితో పరిచయం ఏర్పడింది. అది స్నేహమా.. ప్రేమా.. కూడా తెలియదు. సందర్భోచితంగా బహుమతులు ఇచ్చేవాడు. విందుకు ఆహ్వానించేవాడు. ఆ సమయంలో ఆ అమ్మాయి 'ట్రై టు అండర్‌స్టాండ్ మీ' అన్నా అతను అవేవి పట్టించుకోలేదు. ఆ మాటలోని భావాన్ని అర్థం చేసుకోలేదు. చివరకు ఆ అమ్మాయి మరో అబ్బాయితో వివాహమాడింది. దానికి ఆగ్రహించిన ఈ కాలేజీ కుర్రాడు అమ్మాయిని నిలదీశాడు. నీ కోసం వేల రూపాయలు ధారపోశానంటూ లెక్కలు చెప్పాడు. నా ఇష్టాఇష్టాలు తెలుసుకోకుండా తొందరపడ్డావు. ఆశలు పెంచుకున్నావు. అది నా తప్పు కాదు. ఐయామ్ సారీ అంటూ వెళ్లిపోయింది. చివరకు అతను ఉన్మాదిగా మారాడు. హత్యచేసే స్థాయికి ఎదిగాడు. ఇలా స్నేహానికి, ప్రేమకు తెలియని యువత తమ జీవితాలను ఎలా నాశనం చేసుకుంటున్నారో తెలియజేస్తూ చక్కటి సందేశాలతో స్ఫూర్తి థియేటర్ ఫర్ ఎడ్యుకేషన్ పప్పెట్రీ ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్ సంస్థ ప్రధాన కార్యదర్శి పద్మినీ రంగరాజన్ వాలంటైన్‌డే సందర్భంగా గురువారం హైదర్‌గూడలోని పీఎంఎస్‌లో ప్రదర్శించిన తోలుబొమ్మలాట ప్రధానాకర్షణగా నిలిచింది. పాశ్చాత్య నాగరికతకు అలవాటుపడిన నేటితరం భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను తుంగలోకి తొక్కి తప్పటడుగులు వేస్తున్నారు. కుటుంబ వ్యవస్థలోని బంధాలు, బంధుత్వాలకు ప్రేమానురాగాలకు దూరమవుతున్నారని పద్మినీ రంగరాజన్ తెలిపారు. ప్రస్తుతం యువతరం ఆనందోత్సవాల మధ్య జరుపుకుంటున్న వాలంటైన్‌డేలోని అసలు సారాంశాన్ని గ్రహించకుండానే అదుపు తప్పి ప్రవర్తిస్తున్నారు. ఒక్కరోజు ఆనందం కోసం లక్షలు ఖర్చు చేస్తున్నారు. ఇదంతా అవసరమా.. ప్రేమికుల రోజులోని మంచి, చెడులను గురించి తెలియజేస్తూ యువతరాన్ని చైతన్యవంతుల్ని చేయడానికి ఆమె నగరంలోని ఇంజినీరింగ్, డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో ప్రదర్శనలూ ఇచ్చారు. ఎదిగే వయస్సులో తప్పటడుగులు వేస్తే.. భవిష్యత్తు ఎంత ప్రమాదకరంగా ఉంటుందో కూడా తన తోలు బొమ్మలాట ద్వారా చెప్పిన తీరు ఆకట్టుకుంది.

**Puppet Presentation on "Building Healthy Relationship" at Progressive Media Service-PMS, Hyderguda---Eenadu Telugu Daily Hyderabad Edition February15, 2008**